

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 208 పేజీలు - 08 వెల - 05/- శనివారం 25-07-2026


ఉన్నతంగా చదివి గొప్ప ప్రయోజకులు కావాలి.



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాకే 'నీట్'పై చర్చ: రాహుల్ గాంధీ




- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు నీట్‌పై చర్చ ఉండదన్న రాహుల్
- నీట్ వివాదంపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- సభలో తన మైక్‌ను లాగేసుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపణ
- విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని విపక్షాల డిమాండ్

మంత్రి రాజీనామా డిమాండ్‌తో పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్టంభన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు లోక్‌సభలో ఎలాంటి చర్చకూ ఒప్పుకునేది లేదని విపక్ష నేత (ఎల్‌ఓపీ) రాహుల్ గాంధీ శుక్రవారం స్పష్టం చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించాకే తదుపరి సంభాషణ ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. మిగతాది 2లో

## కేంద్రంతో సీజేపీ చర్చలు..

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు వీడని సీజేపీ
- రేపు మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్ర ప్రభుత్వం
- పరిహారం, విద్యార్థులపై కేసులు ఎత్తివేయడానికి సూత్రప్రాయ అంగీకారం
- డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని సీజేపీ స్పష్టీకరణ



2

## పేద పిల్లల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం




- రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి
- డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్, 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడి
- గత ప్రభుత్వ అప్పులను తీరుస్తూనే సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామని స్పష్టీకరణ




*ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మార్కులు తగ్గితే, అది విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మార్కులు తగ్గినట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. లోకేశ్ ఏరికోరి విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించారని, విద్యారంగంపై ఆయనకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావాలన్న తపనతో ఆయన పనిచేస్తున్నారని, ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో కనిపిస్తున్న మార్పులు చూస్తుంటే ఆనందంగా ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్' (ఆవీ) సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.*

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "కొత్త జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారి ఇక్కడికి వచ్చాను. ఇవాళ నేను కూడా టీచర్‌ను అయ్యాను, నేర్చుకోవడానికి విద్యార్థిని అయ్యాను, తల్లిదండ్రులకు చెప్పడానికి మెంటర్‌గా మారాను" అని అన్నారు. పిల్లల భవిష్యత్తు బాధ్యతను తల్లిదండ్రులిద్దరూ తీసుకోవాలని, అప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హితవు పలికారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు ప్రారంభమయ్యాయని, మిగతాది 2లో

## నిరుపయోగ ప్రభుత్వ స్థలాలను గుర్తించండి

- వివిధ శాఖల పరిధిలోని నిరుపయోగ స్థలాలు గుర్తించండి : సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ :-క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశిం చారు. ఈ అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలు గుర్తించాలని అధికారులకు ఆయన సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, వేరేచోట ఆయా శాఖలకు స్థలాలను కేటాయించాలని ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అలా కాకుండా పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలన్నారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని మిగతాది 2లో

## యువత భవిష్యత్తే మోదీకి పరమావధి



- విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందన్న మాధవ్
- గతంలో పోలిస్తే పేపర్ లీకేజీలు బాగా తగ్గాయని వెల్లడి
- నీట్ సాకుతో సుప్రీంకోర్టుపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపాటు

ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును పరమావధిగా చేసుకుని పనిచేస్తోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందని, దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎంలు, గిరిజన విశ్వవిద్యాలయాలను నెలకొల్పడంతో పాటు మెడికల్ సీట్లను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వాల హయాంతో పోలిస్తే తమ పాలనలోనే విద్యా పేపర్ లీకేజీలు గణనీయంగా తగ్గాయని, నీట్ వ్యవహారంలో సమస్య వెలుగుచూడగానే కేంద్రం తక్షణమే కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు. నీట్ వివాదాన్ని సాకుగా చూపి కొందరు విపక్ష నేతలు ఢిల్లీ వేదికగా మత విద్వేషాలను మిగతాది 2లో

## విద్యార్థుల ఆందోళన నుంచి దృష్టి మళ్లించేందుకే బిల్లు:విపక్షం

### పార్లమెంట్ లోపల, బయట ఆందోళనలు



***న్యూఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసా గుతోంది. పార్లమెంట్ లోపల, వెలుపల ఆందో ళనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని మోడీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. శు క్రవారం పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద వర్షంలో ఇండియా బ్లాక్ ఎంపీలు నిరసన చేపట్టారు. 'ప్రధాన్‌ను తొలగించాలి' అనే బ్యానర్లతో నినాదాల హోరెత్తించారు. మరోవైపు లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగింది. దీంతో సభను స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు.*

లోక్‌సభలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ నీట్‌పై చర్చ జరగాలని ప్రతిపక్షాలతో చెప్పానని, దేశ ప్రజలకు ప్రధాని మోడీ హామీ ఇచ్చారని అన్నారు. సోనమ్ వాంగ్‌చెక్ తన నిరాహార దీక్షను విరమించారని, ఆయన కూడా సభలో చర్చ జరగాలని ఆశించారని తెలిపారు. ఒకవేళ ఇప్పుడు చర్చ చేపట్టకుంటే, అది సరైన సందేశాన్ని ఇవ్వబోదని అన్నారు. ఈ అంశంపై చర్చకు ముందుగా మంత్రి ప్రధాన్ తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తన పేరు ప్రస్తావించి, సభా కార్యకలాపాలను కొనసాగించనివ్వాలని ప్రతిపక్ష ఎంపీలను కోరినప్పటికీ, తనను సభలో మాట్లాడటానికి అనుమతించలేదని అన్నారు. "సాధారణ నియమావళి ప్రకారం, ఎవరైనా ఒకరి పేరు ప్రస్తావిస్తే ఆ వ్యక్తి స్పందించాలి, కానీ నేను స్పందించాలనుకున్నప్పుడు నన్ను మాట్లాడనివ్వలేదు" అని అన్నారు. "నేను ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. విద్యార్థులకు మూడు డిమాండ్లు ఉన్నాయి. అవినీతిపరుడైన విద్యాశాఖ మంత్రి పదవి నుంచి వైదొలగాలి. విద్యార్థులను కొట్టిన వారిపై చర్య తీసుకోవాలి. ప్రధానమంత్రి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. "ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించే వరకు మేము ఎలాంటి చర్చలు జరపబోము" అని అన్నారు. మిగతాది 2లో

## వైజాగ్‌లో అదానీ ఎనర్జీకి రూ. 8,500 కోట్ల భారీ ప్రాజెక్ట్

- ఏపీలో రూ. 8,500 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును దక్కించుకున్న అదానీ ఎనర్జీ
- వైజాగ్‌లో గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా
- డేటా సెంటర్లు, డిజిటల్ ఇన్‌ఫ్రా వృద్ధికి కూడా ఈ ప్రాజెక్ట్ కీలకం
- 30 నెలల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యం
- ఈ ప్రాజెక్ట్‌తో 1,582 కి.మీ. ట్రాన్స్‌మిషన్ లైన్లు, 10,500 ఎంవీఏ సామర్థ్యం అదనం



2

## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు.

2



- విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రం అహర్నిశలు కృషి చేస్తోందన్న బండి సంజయ్
- నీట్ ఘటనపై మోదీ తీవ్రంగా కలత చెందారని వ్యాఖ్య
- ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పారన్న బండి సంజయ్

ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ

# విద్యార్థుల ఆందోళన నుంచి దృష్టి మళ్లించేందుకే బిల్లు: విపక్షం

రాజ్యసభలోనూ..

రాజ్యసభలో కూడా నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షలు చర్చకు పట్టుపట్టాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేశారు. తొలుత 12 గంటలకు సభ వాయిదా వేశారు. ఆ తరువాత ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్ష సభ్యులు ప్రధాన్ రాజీనామాకు పట్టుపట్టారు. దేశ రాజధానిలో నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ తో సహా పోలీసుల చర్య గురించి మాట్లాడటానికి రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడైన మల్లికార్జున్ ఖర్గే లేచారు. సభలో గందరగోళం చెలరేగడంతో మధ్యాహ్నం గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో వందేమాతరం బిల్లును ప్రవేశపెట్టిన వెంటనే, ప్రతిపక్ష ఎంపీల నిరసనలు కొనసాగుతుండటంతో సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో వందేమాతరం బిల్లు విద్యార్థుల ఆందోళన నుంచి దృష్టి మళ్లించడానికే ఇదిః ప్రతిపక్షం

వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టింది. శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టారు. "1971 నాటి 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ చట్టం'ను సవరించడానికి ఉద్దేశించబడింది. ప్రస్తుత చట్టం ప్రకారం, జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం వంటి జాతీయ చిహ్నాల పట్ల అగౌరవ చర్యలకు పాల్పడిన వారికి మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించబడుతుంది. ప్రతిపాదిత సవరణ వందేమాతరానికి కూడా అదే విధమైన రక్షణను కల్పించాలని కోరుతోంది. ఈ బిల్లు ప్రకారం, జాతీయ గీతాన్ని ఆలపించడంలో ఆటంకం కలిగించినా లేదా ఏ రూపంలోనైనా దానిని అవమానించినా, అది చట్టరీత్యా శిక్షార్హమైన చర్య అవుతుంది" అని పేర్కొన్నారు. అయితే.. ఈ బిల్లుపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ రూల్ 67 కింద నోటీసు ఇచ్చారు. "ఒక చట్టంతో దేశభక్తిని, జాతీయవాదాన్ని సృష్టించలేరు" అని ఆయన అన్నారు. రాజ్యాంగం, పార్లమెంటు ఉద్దేశపూర్వకంగా నిలిపివేసిన వందేమాతరంకు చట్టబద్ధమైన హోదా, శిక్షా రక్షణను కల్పించడమే ఈ బిల్లు లక్ష్యమని బ్రిట్టాస్ అన్నారు. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24 నాటి ప్రకటనను ఉటంకించారు. ఈ విషయంపై రాజ్యాంగ పరిషత్ అధికారిక తీర్మానాన్ని ఆమోదించకూడదని నిర్ణయించుకుందన్న విషయాన్ని అది విస్మరించిందని పేర్కొన్నారు. ఫలితంగా, ఆ ప్రకటనకు ఎన్నడూ రాజ్యాంగ బలం చేకూరలేదని ఆయన అన్నారు. దాదాపు మూడేళ్ల చర్చల అనంతరం రాజ్యాంగ పరిషత్తు జాతీయ గీతానికి, జాతీయ గేయానికి సమాన రాజ్యాంగ హోదా ఇవ్వకూడదని నిర్ణయించుకుందని, ఈ బిల్లు దాన్ని మార్చడానికి ప్రయత్నిస్తోందని బ్రిట్టాస్ పేర్కొన్నారు. వందేమాతరం మొదటి రెండు చరణాలకే అధికారిక వినియోగాన్ని పరిమితం చేసే చారిత్రక ఏకాభిప్రాయాన్ని కూడా ఆయన ఉదహరించారు. ఈ బిల్లు, రాజ్యాంగం, జాతీయ పతాకం, జాతీయ గీతం పట్ల గౌరవాన్ని ప్రాథమిక విధులుగా పేర్కొనే ఆర్టికల్ 51ఎ(ఎ)కి విరుద్ధంగా ఉందని, అందులో జాతీయ గీతం గురించి ప్రస్తావించలేదని ఆయన అన్నారు. 1971 నాటి జాతీయ గౌరవ అవమానాల నివారణ చట్టాన్ని కూడా ఉదహరించారు. దీని ప్రకారం పార్లమెంట్ సెక్షన్ 3 కింద శిక్షా రక్షణను కేవలం జాతీయ గీతానికి మాత్రమే పరిమితం చేసిందని అన్నారు. బిజో ఇమ్మాన్యుయేల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఉటంకిస్తూ జాతీయ గీతానికి సంబంధించిన ప్రవర్తనను నేరంగా పరిగణించడం వాక్ స్వాతంత్ర్యం, అంతరాత్మ స్వేచ్ఛ, మత స్వేచ్ఛను పరిమితం చేస్తుందని పేర్కొన్నారు. ఆర్టికల్స్ 14, 19(1)(ఎ), 21, 25 కింద ఆందోళనలను లేవనెత్తారు. జనవరిలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాతీయ గేయంపై ప్రోటోకాల్ ఉత్తర్వులు జారీ చేసినప్పుడు, ఆ ప్రోటోకాల్‌కు ఎటువంటి శిక్షాత్మక పరిణామాలు లేవనే ఏకైక కారణంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడానికి నిరాకరించిందని, అయితే ఈ బిల్లు ఆ వైఖరిని తలకిందులు చేస్తుందని ఆయన అన్నారు. బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతి నిరాకరించాలని చైర్మన్ సిపి రాధాకృష్ణన్‌ను బ్రిట్టాస్ కోరారు. సిపిఐ ఎంపి పి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన నుండి దృష్టి మరల్చడానికే వందేమాతరం బిల్లును తీసుకువచ్చారని పేర్కొన్నారు. "నాకు వందేమాతరం అంటే చాలా ఇష్టం, కానీ ఈ బిల్లు ఠాగూర్, బంకిం చంద్రల మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తున్నందున నేను దీనిని వ్యతిరేకిస్తున్నాను" అని అన్నారు.

# నిరుపయోగ ప్రభుత్వ స్థలాలను గుర్తించండి

ఒక్కో ఫ్లాట్ ను దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షల ఖర్చువుతుండగా ప్రభుత్వం ఇందులో 5 లక్షల రూపాయల సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడు తన వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ల్యాండ్ కాస్ట్‌ను మాత్రం పూర్తిగా ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్ర నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్ నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది. ఈ క్రమంలోనే ఆయా పరిధిల్లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీలు ఎన్.శ్రీధర్, వి.శేషాద్రి, రెవెన్యూ సెక్రెటరీ లోకేష్ కుమార్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హౌజింగ్ స్పెషల్ సెక్రెటరీ వీపీ గౌతమ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

కఠిన నిబంధనలు తేవాలి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

విద్యాసంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని సూచన

డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ విషయంలో సర్కారు సీరియస్ గా దృష్టి సారించిందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతా ధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిరోధం, భద్రతా కమిటీలపై అధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు. సీఎం మాట్లాడుతూ విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని సూచించారు. క్యాంపస్ లోపల డ్రగ్స్ కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్ని బాధ్యులను చేయాల్సిందేనని స్పష్టం చేశారు. క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని వివరించారు. విద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని చెప్పారు. డ్రగ్స్ కు సంబంధించి సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం ఈ మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్ కు తరలించాలని చెప్పారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని పరిశీ లించాలని పేర్కొన్నారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహ రించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సలహాదారులు కె.రామకృష్ణారావు తదితరులతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేద పిల్లల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

'బడి కోసం' పోర్టల్ ఆవిష్కరణ.. వెల్లువెత్తిన విరాళాలు

ఈ కార్యక్రమంలో భాగంగా, పాఠశాల విద్యాశాఖ రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభించిన వెంటనే రంపచోడవరం హైస్కూల్‌కు మీ-సేవ ఆపరేటర్ చిట్టిబోయిన ఉదయ్ కుమార్ లక్ష రూపాయల విరాళం ప్రకటించగా, నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త పూర్ణచంద్రరావు రూ.4 కోట్లు విరాళం ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు నింపింది.

ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పాలన

రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, మనసుంది కాబట్టే 'తల్లికి వందనం' వంటి పథకాలను అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెట్టిందని విమర్శించారు. తాము ఆ ఆస్తులను విడిపిస్తూ, అధిక వడ్డీల భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి నుంచి, ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన ఠంఛనుగా జీతాలు, పెన్షన్లు ఇస్తున్నామని గుర్తుచేశారు. ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే, సంక్షేమం-అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమం, యువతకు భవిష్యత్

ఉపాధ్యాయులకు సముచిత గౌరవం ఇస్తున్నామని, పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించని గత ప్రభుత్వానికి భిన్నంగా, తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని పూర్తిచేశామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నియమితులైన కొత్త ఉపాధ్యాయులను అభినందించారు. విశాఖకు గూగుల్ వంటి సంస్థలను తీసుకువస్తున్నామని, ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే, రాష్ట్రంలోనే పెద్ద ఉద్యోగాలు కల్పించే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు.

అనంతరం గంజాయి సాగును నిర్మూలించి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తామని, జీవో నెంబర్-3పై చర్చించి గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్రంతో సీజేపీ చర్చలు..

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, లేదంటే ఆయన్ను బర్తరఫ్ చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) డిమాండ్ చేసింది. నీట్ పరీక్షల వివాదంపై కేంద్ర ప్రభుత్వంతో రెండో విడత చర్చలు ముగిసిన అనంతరం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మంత్రి రాజీనామా డిమాండ్‌పై స్పందించేందుకు కేంద్రం రేపు మధ్యాహ్నం వరకు గడువు కోరిందని, అప్పటివరకు విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతాయని సీజేపీ ప్రకటించింది. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఇవాళ మధ్యాహ్నం కీలక చర్చలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, పీఎంఓ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ హాజరుకాగా, సీజేపీ నుంచి జాతీయ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా పాల్గొన్నారు. సమావేశం అనంతరం సీజేపీ నేత అశుతోష్ రాంకా మాట్లాడుతూ.. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై ప్రభుత్వం రేపటి మధ్యాహ్నం వరకు సమయం కోరింది. ఆయన్ను త్వరలోనే తొలగిస్తారని ఆశిస్తున్నాం. పరీక్షల అక్రమాల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లు, కేసులు ఉపసంహరించుకోవాలనే మా డిమాండ్లకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది" అని వివరించారు. శాంతియుతంగా నిరసన తెలిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని, బాధితుల కుటుంబాలకు తగిన పరిహారం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సీజేపీ చర్చలకు అంగీకరించింది. చర్చలకు ముందే సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్ లో ఎలాంటి మార్పులేదని స్పష్టం చేశారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీపై మంత్రి జేపీ నడ్డా స్పందించారు. "వారు మూడు ప్రధాన డిమాండ్లు, పరీక్షల సంస్కరణలకు సంబంధించి ఐదు సూచనలు చేశారు. ప్రభుత్వంలో అంతర్గతంగా చర్చించి, రేపు మధ్యాహ్నం మరోసారి సమావేశమై మా నిర్ణయం తెలియజేస్తామని చెప్పాం" అని ఆయన అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో నిన్న రాత్రి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఒక వీడియో సందేశం విడుదల చేశారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేందుకు, కేసుల సత్వర విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే ముసాయిదా బిల్లును కేంద్ర కేబినెట్ పరిశీలిస్తుందని ప్రకటించారు. "ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని నేను ఇప్పటికే సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశాను" అని మోదీ స్పష్టం చేశారు.

## యువత భవిష్యత్తే మోదీకి పరమావధి: పీవీఎన్ మాధవ్

ఆయన ఆరోపించారు. నీట్ సాకుతో ప్రధానితో పాటు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నటుడు ప్రకాశ్ రాజ్ సహా కొందరు విద్రోహకర, దేశ వ్యతిరేక వ్యాఖ్యలకు పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని విద్యా సంఘాలు విద్యార్థుల ప్రయోజనాలను పక్కనబెట్టి వారి భవిష్యత్తును నాశనం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తమ సొంత పాలనలో జరిగిన పేపర్ లీకేజీలపై పార్లమెంట్‌లో మాట్లాడాలని, సభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేకనే ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని సవాల్ విసిరారు. విశాఖ సమీపంలోని భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారని, ఈ చారిత్రాత్మక ఘట్టంలో 13 వేల మంది కళాకారులతో కూడిన సంప్రదాయ థింసా నృత్యం, బొబ్బిలి వీణా నాదంతో ఆయనకు అద్భుత స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమం సందర్భంగా ఏకంగా 3 లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చాక ఉత్తరాంధ్రలో వెనుకబడిన ప్రాంతమంటూ ఏదీ ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని, ఆ ప్రాంత సమగ్ర ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందని పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును చిరస్థాయిగా నిలిపేందుకే ఈ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టారని మాధవ్ వివరించారు.

# వైజాగ్‌లో అదానీ ఎనర్జీకి రూ. 8,500 కోట్ల భారీ ప్రాజెక్ట్

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ప్రముఖ సంస్థ అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) రాష్ట్రంలో రూ. 8,500 కోట్ల విలువైన భారీ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును దక్కించుకుంది. విశాఖపట్నం ప్రాంతంలో ప్రతిపాదిత గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీని ద్వారా సుమారు 4,500 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం నిర్వహించిన టారిఫ్-ఆధారిత పోటీ బిడ్డింగ్ (టీబీసీబీ) విధానంలో అత్యంత పోటీతత్వ ధరను కోట్ చేసి అదానీ ఎనర్జీ ఈ ప్రాజెక్టును కైవసం చేసుకుంది. ఒప్పందం ప్రకారం.. ఈ ప్రాజెక్టును 30 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రాజెక్టును 'వైజాగ్ పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్' అనే ప్రత్యేక సంస్థ (ఎస్‌పీవీ) కింద నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టుపై అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ సీఈఓ కందర్ప్ పటేల్ మాట్లాడుతూ.. "భారతదేశ పారిశ్రామిక ప్రగతికి అవసరమైన ఇంధన మౌలిక సదుపాయాల నిర్మాణంలో వైజాగ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన ముందడుగు. ఇది ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సామర్థ్యం అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే కాకుండా, పెందుర్తి-విశాఖపట్నం ప్రాంతంలో పెరుగుతున్న డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిమాండ్‌కు గ్రిడ్‌ను బలోపేతం చేస్తుంది" అని వివరించారు. ప్రస్తుతం విశాఖపట్నం డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పెద్ద ఎత్తున ఏఐ, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ల అభివృద్ధి, సబ్‌సీ కనెక్టివిటీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ వంటివి రానున్నాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఈ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది. ఈ ప్రాజెక్ట్‌తో ఏఈఎస్ఎల్ తన నెట్‌వర్క్‌కు అదనంగా 1,582 సర్క్యూట్ కిలోమీటర్ల (సిఎం) ట్రాన్స్‌మిషన్ లైన్లు, 10,500 ఎంవీఏ ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యాన్ని జోడించనుంది. దీంతో కంపెనీ మొత్తం ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ 29,531 సిఎంకు, ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం 1,33,675 ఎంవీఏకు చేరుకుంటుంది. దేశంలో అతిపెద్ద ప్రైవేట్ ట్రాన్స్‌మిషన్ కంపెనీగా ఏఈఎస్ఎల్ కొనసాగుతోంది.

## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు: బండి సంజయ్

ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు. నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో విష ప్రచారం చేస్తూ, దేశంలో అశాంతిని రేపేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, భారత్‌లో అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను తక్షణమే బ్లాక్ చేసిందని బండి సంజయ్ తెలిపారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాకే 'నీట్'పై చర్చ: రాహుల్ గాంధీ

విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ వాయిదా పడిన కాసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతకుముందు, పేపర్ లీకేజీల అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభలో ప్రకటించారు. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు తెస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, రాహుల్ గాంధీ చర్చకు సహకరించాలని రిజిజు కోరారు. అనంతరం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, తన మైక్‌ను లాగేసుకున్నారని ఆరోపించారు. విద్యార్థుల తరఫున విపక్షాలు మూడు ప్రధాన డిమాండ్లు చేస్తున్నాయని ఆయన పునరుద్ఘాటించారు. అవి: 1. "అవినీతిపరుడైన" విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. 2. నిరసన చేస్తున్న విద్యార్థులపై దాడి చేసి, కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి. 3. విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలి. "ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించే వరకు మేం ఎలాంటి చర్చలు జరపబోం," అని రాహుల్ దృఢంగా చెప్పారు. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి నీట్-యూజీ పరీక్ష పత్రాల లీకేజీ అంశం పార్లమెంటును కుదిపేస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కొత్త చట్టం తెచ్చామని చెబుతున్నప్పటికీ, మంత్రి రాజీనామా చేయాల్సిందేనని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ వివాదంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది.



## శ్రీ కామేశ్వరి అమ్మవారికి ఆషాడం సారె





మహానంది, పల్లె వెలుగు మహానంది క్షేత్రంలో వెలిసిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి ఆషాఢ శుద్ధ దశమి, శుక్రవారం సందర్భంగా ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మహానంది ప్రజలు, పౌర్ణమి మహిళా సంఘానికి చెందిన వందలాది మంది మహిళలు సారెతో ఆలయానికి వచ్చారు. వీరికి అధికారులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మహిళలు ఉత్సవంగా తెచ్చిన పట్టువస్త్రాలు, సారెను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలి

- అన్న క్యాంటీన్ల నిర్వాహకులకు కమిషనర్ ఆదేశం
- ఆహార నాణ్యత ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలి





పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : అన్న క్యాంటీన్లలో భోజనం చేసే ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని, ఆహార నాణ్యత ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సెట్కూరు కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, ఆహార నాణ్యత, తాగునీటి వసతులను పరిశీలించి, భోజనదారులతో మాట్లాడారు. డిజిటల్ విధానంలో టోకెన్ల జారీ ప్రక్రియను పరిశీలించి, లబ్ధిదారులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి ఒక్కరికీ తక్కువ ఖర్చుతో నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నిర్వహిస్తోందన్నారు. ఒక్కో భోజనానికి ప్రభుత్వం రూ.65 సబ్సిడీ అందిస్తూ, లబ్ధిదారుల నుంచి కేవలం రూ.15 మాత్రమే వసూలు చేసి త్రిపూటల భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పథకంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని నిర్వాహకులను ఆదేశించారు.

## ఏ విద్యార్థి చదువుకు దూరంగా ఉండకూడదు అన్నదేకూటమి ప్రభుత్వ లక్ష్యం.

**మండల కన్వీనర్ దిలీప్ కుమార్ రెడ్డి.**




గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేముల లోని మోడల్ స్కూల్ లో మరియు బుజనూరు ఎం.పి.పి స్కూల్ మెగా పీటీఎం 4.0 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల టిడిపి అధ్యక్షులు పంట దిలీప్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంట దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయకి ఎదగాలని, విద్య తప్ప పక్క దారి పట్టకూడదని, విద్యార్థి వయసులో విద్యమీద మాత్రమే శ్రద్ధ నిలిపితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఏపీలో రూ.30 వేల కోట్లను బడ్జెట్‌లో విద్య కోసం ప్రభుత్వం కేటాయిస్తుందని చెప్పుకొచ్చారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు జీవితంలో ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు ఒక రోజులో కనీసం గంట సమయం కేటాయించి వారితో గడిపి వారి విద్యతో పార్టీ వారి క్రమశిక్షణపై శ్రద్ధ నిలపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శైలజ, పాఠశాల ఉపాధ్యాయులు, చైర్మన్ ఈశ్వర్ రెడ్డి,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యాతోనే బంగారు భవిష్యత్

మహానంది, పల్లె వెలుగు విద్యాతోనే విద్యార్థులకు




బంగారు భవిష్యత్తు ఉంటుందని గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరాల జయ చంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం ఆంజనేయపురం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం




నిర్వహించారు. అలాగే మహానంది మండలంలోని మసీదుపురం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోమెగా పీటీఎం-4.0 కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశమై పాఠశాలల అభివృద్ధిపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్స్ - టీచర్ సమావేశాలకు హాజరై పిల్లల చదువు, ప్రగతి గురించి ఉపాధ్యాయులను తెలుసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమిష్టిగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతోపాటు విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్ల వచ్చని పేర్కొన్నారు.విద్యార్థులు రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ పెరుమాళ్ళ వెంకటాద్రి, విద్యా కమిటీ చైర్మన్ బాల నర్సి, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

---

# ఆరోగ్యమే మహాభాగ్యం



పల్లె వెలుగు:అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం జూలై 24వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం నిర్వహిస్తారు.స్వీయ సంరక్షణ గతంలో కంటే ప్రస్తుత కాలంలో చాలా ముఖ్యమైంది.ఆరోగ్య ప్రమాదాలు ప్రకృతి వైపరీత్యాలు ఆర్థిక నేపథ్యంలో మనల్ని మనం మానసికంగా శారీరకంగా చూసుకోవడం చాలా ముఖ్యం.నేటి ఉరుకుల పరుగులజీవితంలో మానసికశారీరక ఆరోగ్యాన్నికాపాడు కోవడం ఎంతఅవసరమో గుర్తు చేయడమే ఈరోజుముఖ్య ఉద్దేశం.వారంలో ఏడు రోజులు రోజుకు 24 గంటలు మనఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలనే సందేశాన్ని ఇవ్వడమే అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవంయొక్క ముఖ్య ఉద్దేశం.స్వీయ సంరక్షణ అంటే కేవలం విలాసవంతమైన జీవితం గడపడం లేదా బ్యూటీ పార్లర్లకు సినిమాలకు పబ్బులకు వెళ్లడం మాత్రమే కాదు.ఆరోగ్య పరిరక్షణలి అనారోగ్యం రాకుండా మన శరీరాన్నిమనసును మనమే జాగ్రత్త చూసుకోవడం.మనల్ని మనం జాగ్రత్తగా చూసుకోవాలి.మీకోసం సమయం ఇవ్వండిలి మీకోసం ప్రతి రోజు కొంత సమయానికిటాయించడం స్వీయ సంరక్షణ చిట్కాలలో సులభమైనదిముఖ్యమైనది .ప్రతిరోజు కనీసం మన కోసం గంటా లేదా రెండు గంటలు సమయం కేటాయించుకోవాలి. మనం ఆనందించే పని చేయడానికి ఈ సమయాన్ని ఉపయోగించుకోవాలి .మన మానసిక ప్రశాంతత మన అయుఃప్రమాణాన్నీ పెంచుతుంది. రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్య సంరక్షణ మెరుగుపడుతుంది.ఆరోగ్యకరమైన ఆహారం తినండిలి ఆరోగ్యంగా తినడం స్వీయ సంరక్షణ ముఖ్యమైన భాగం తాజా పండ్లు కూరగాయలు పౌష్టికాహారంతో కూడిన సమతుల ఆహారం తినడం వల్ల శక్తి సామర్థ్యాలు పెంచుకోవచ్చు. అంతేకాకుండా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి మంచిఆహారంసహాయపడుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు స్వీట్ సీతల పానీయాలు నివారిస్తే మంచిది.బాధ్యతాయుత ప్రవర్తనలి వైద్యులపై ఆధారపడటం తగ్గించి రోజువారీ అలవాట్లతోనే ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవడం. నిద్ర ఆహారాల మధ్య సరియైన సమయాన్ని పాటించి మన ఆరోగ్యం మన చేతుల్లోనే చేతుల్లోనే ఉందనే స్పృహతో మెరుగైన అలవాట్లను పెంపొందించుకోవాలి.జీవనశైలిలి జీవన నాణ్యతను పెంచే చిన్నచిన్న మార్పులను అలవర్చుకోవడం. రోజుకు కొంత సమయం ప్రకృతిలో గడపడం

కల్తీ లేని పహారాన్ని భుజించడం. కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రకృతికి దగ్గరగా జీవించే అలవాట్లను పెంపొందించుకోవలి. స్వీయం సంరక్షణలోని నాలుగులి ముఖ్యమైన స్తంభాలు ఈ దినోత్సవం సందర్భంగా ఈ క్రింది అంశాలపై అవగాహన కల్పిస్తారు. శారీరక సంరక్షణ

రోజుకు కనీసం 7 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరిగా పోవాలి. పోషకాలు ఉన్న సమతుల ఆహారం మరియు తగినంత నీరు తీసుకోవాలి .ప్రతిరోజు 30 నిమిషాల పాటు వ్యాయామం లేదానడకఅలవాటుచేసుకోవాలి .

స్వీయ సంరక్షణలో వ్యాయామం ముఖ్యమైంది .రెగ్యులర్ వ్యాయామం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది .మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది మన శరీర ఫిట్నెస్ స్థాయిని పెంచుతుంది. వాకింగ్ లేదా రన్నింగ్ ఇతర వ్యాయాయంలో పాల్గొనడంవల్ల స్నేహితులు కుటుంబ సభ్యులతో బంధాలుమరింతమెరుగుపడతాయి.తగినంత నిద్రపోవాలిలి తగినంత నిద్రపోవడం మంచి ఆరోగ్యానికి కీలకం రాత్రి కచ్చితంగా7 లేదా 8 గంటలు నిద్రపోవాలి. పడుకోవడానికి ఒక గంట ముందు అని లైట్స్ ఆఫ్ చేయాలి. ఇది నిద్ర వేళకు ముందు మీ శరీరం మనసు విశ్రాంతి తీసుకోవడానికి సహాయ పడుతుంది.మైండ్ ఫుల్ నేస్ ప్రాక్టీస్ చేయండిలి మనల్ని మనం జాగ్రత్త చూసుకోవడానికి మరొక మార్గం రోజు మైండ్ ఫుల్ సాధన చేయడం. మైండ్ ఫుల్ సాధన ఒత్తిడిస్తాయిని తగ్గిస్తుంది .మన ఏకాగ్రతను మెరుగుపరిచిసాను కుల ఆలోచనలు కలిగిస్తుంది. సానుకూల భావోద్వేగాలనుపెంపొందిస్తుంది.

మనపై మనకు నమ్మకాన్ని పెంచుతుంది. ధ్యానము యోగ వంటివి మనతో మనం కనెక్ట్ అవ్వడానికి ఉపయోగపడతాయి ఒత్తిడిని తగ్గిస్తాయి.నేదునూరి కనకయ్యఅధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం మాజీ ఎన్ ఎస్ ఎస్ అధికారి రచయిత కాలమిస్ట్ కరీంనగర్.

# ఉన్నతంగా చదివి గొప్ప ప్రయోజకులు కావాలి.

**తల్లిదండ్రుల కు ఉపాధ్యాయులు కు మంచి పేరు తీసుకురావాలి.**
**38వ వార్డు టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్ర



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కు నంద్యాల నియోజకవర్గం లోని నందమూరి నగర్ 38 వార్డు లోని పురపాలక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో,ఉర్దూ ప్రాధిమిక పాఠశాలల నందు శుక్రవారం 38 వార్డు టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది బుగ్గరాముడు కి ఘన స్వాగతం పలికారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి బుగ్గరాముడు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుండి పాఠశాలలో మంచి క్రమశిక్షణ మరియు నైతిక విలువలతో కూడిన చదువు చదువుకొని గొప్ప ప్రయోజకులు కావాలని , మిమ్మల్ని కన్నవారికి, ఉన్న ఊరికి, ఉపాధ్యాయులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి నిరంతర శ్రమ పట్టుదల కృషి అవసరమని తెలిపారు.

మారుతున్న టెక్నాలజీ పరంగా ప్రతీ ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరుచుకొని నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలని చెప్పారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతో, విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది అని ఆయన అన్నారు. అలాగే స్థానిక మంత్రి ఎన్ఎండి.ఫరూక్ వారి కుమారులు ఫిరోజ్,ఫయాజ్ ఆధ్వర్యంలో పాఠశాలను మరింత అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళతాం అని ఆయన అన్నారు. హై స్కూల్ కు తన వంతు సహాయం కింద ఒక బీరువాను డోనేట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ నారాయణ రెడ్డి ,పీరా సాహెబ్ , ఉర్దూ స్కూల్ హెడ్ మాస్టర్ జానీ,టీడీపీ నాయకులు వడ్డే నాగేంద్ర, మహేష్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

## - తల్లిదండ్రులకు కమిషనర్ చల్లా ఓబులేసు సూచన






పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. శుక్రవారం ఓల్డ్ కంట్రోల్ రూం వద్దనున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ సమావేశం (4.0)కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, రంగవల్లులు (ముగ్గులు) ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పిల్లల చదువుతో పాటు వారి హాజరు, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధిపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో నిర్వహించే పేరెంట్--టీచర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరై ఉపాధ్యాయులతో విద్యార్థుల విద్యా పురోగతిపై చర్చించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన అన్ని అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎం. హుస్సేన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ టి. భాను, వైస్ చైర్మన్ ఎస్. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోని మెడికల్ కళాశాల పనులు ప్రారంభించి, వెంటనే పూర్తి చేయాలి.

## ముఖ్యమంత్రి కి ఆదోని సిపిఎం పార్టీ బహిరంగ లేఖ.





ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి బహిరంగ లేక సంబంధించిన లేఖలను ఆదోని పట్టణంలో వ్యాపారస్తులకు, ప్రజలకు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, నాయకులు శ్రీనివాసులు, గౌస్,సంజయ్, శశి తదితరులు పంపిణీ చేయడం జరిగింది. మీరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి విభజిత ఆంధ్ర ప్రదేశ్ కు రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు, రెండవసారి ముఖ్యమంత్రి పదవి పొంది రెండు సంవత్సరాల సంబరాలు కూడా పూర్తి చేసుకున్నారు. 2014 -2019 మధ్యకాలంలో ఐదు సార్లు, 2026 సంవత్సరంలోనే నాలుగు సార్లు జిల్లా పర్యటనకు వచ్చారని వారు గుర్తు చేశారు. అయితే గతంలో మీరు ఇచ్చిన హామీలు హామీలు గానే మిగిలిపోయాయని వారు తెలిపారు. ఇప్పటికైనా ఆస్పరి మండలానికి వస్తున్న తమరు కర్నూలు జిల్లాలో ఉన్న సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులు వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు,ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణం, మెలిగనూరు వద్ద వరద కాలువ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, 75 శాతం పూర్తి అయిన నగర డోనా రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని, ఆస్పరి మండలాన్ని వేదవతి ప్రాజెక్టు పరిధిలోకి తీసుకురావాలని, పందికోన రిజర్వాయర్ నుండి ఆస్పరి మండలానికి తాగునీరు అందించాలని, జిల్లాలో సోలార్ పేరుతో తీసుకున్న రైతుల భూముల లీజును ఐదు సంవత్సరాలకు తగ్గించి, లీజు ఎకరాకు సంవత్సరానికి 50వేల రూపాయలు ఇవ్వాలని వారు తెలిపారు. ఆదోనిలో అసంపూర్తిగా మిగిలిపోయిన మెడికల్ కళాశాల పనులు వెంటనే ప్రారంభించి, పూర్తి చేయాలని వారు తెలిపారు. పై సమస్యలను వెంటనే పరిష్కరించి కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు తోడ్పాటు అందించాలని వారు కోరారు.

# వరుణుడి రాక కోసం మౌలాలి స్వామి సరిగెత్తు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 24:






వరుణుడి రాకను ఆకాంక్షిస్తూ బండి ఆత్మకూరులో మౌలాలి స్వామి సరిగెత్తును నిర్వహించారు. ఈనెల



17వ తేదీన మౌలాలి స్వామి పెట్టెను గ్రామ పురవీధులలో మేళ తాళాల మధ్య ఊరేగింపు నిర్వహించి హుస్సేన్ షావలి దర్గా వద్ద ఫాతిహా కార్యక్రమాన్ని నిర్వహించి స్వామిని కొలువులో కూర్చోబెట్టారు. ఖరీఫ్ సీజన్లో వర్షాలు కురవక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైఎస్ఆర్ పార్టీ నంద్యాల జిల్లా మహిళా సంఘం అధ్యక్షులు రాజంరెడ్డి సుజాతమ్మ, వారి కుటుంబ సభ్యులు మౌలాలి స్వామి స రిగెత్తును నిర్వహించేందుకు పూనుకున్నారు. స్వామి కొలువు దీరిన నాటి నుండి రెండు రోజులపాటు వర్షం కురియడంతో దీనిని శుభసూచకంగా భావిస్తున్నారు. గురువారం రాత్రి తొమ్మిది గంటల నుండి మౌలాలి స్వామికి పూలదట్టిని సమర్పించేందుకుగాను భాజా భజంత్రీలు డప్పుల సందుల మధ్య ఊరేగింపుగా బయలుదేరారు. స్వామికి సమర్పించే పూలదట్టిని ప్రత్యేకంగా తయారు చేయించారు. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో స్వామికి పూలదట్టి సమర్పించి అందంగా అలంకరించారు. సరిగెత్తు సందర్భంగా రాజంరెడ్డి సుజాతమ్మ, భారత్ గ్యాస్ ఎండి రాజం రెడ్డి మనోహర్ రెడ్డి, సువర్ణ, కుటుంబ సభ్యులు ప్రతాపరెడ్డి, మాధవి, తదితరులు రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌలాలి స్వామి ఆవరణములో ఏర్పాటుచేసిన నిప్పుల గుండంలో భక్తులు నడుస్తూ, స్వామిని స్తుతించారు. శుక్రవారం ఒంటిగంట ప్రాంతంలో స్వామి కొలువు నుండి బయటకు వచ్చి నిప్పుల గుండం నుండి ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం గ్రామంలోకి బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజించి స్వామి కృపకు పాత్రులయ్యారు.

# నంద్యాల పట్టణ కేంద్రంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల రోడ్డు భద్రత సూచనలు.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల పట్టణంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్



క్రమశిక్షణను పెంపొందించడం మరియు ప్రజల ప్రాణ భద్రతను కాపాడడం లక్ష్యంగా నంద్యాల ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా నంద్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆర్ జి సుబ్రమణ్యం ఆటో డ్రైవర్లకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులు మరియు ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అధిక వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ఆటోల్లో అనుమతించిన దానికంటే ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించరాదని, రోడ్డు మధ్యలో ప్రయాణికులను ఎక్కించడం లేదా దించడం చేయకుండా సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే ఆపాలని సూచించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించకుండా, జంక్షన్లు, పాఠశాలలు, ఆసుపత్రులు మరియు రద్దీ ప్రాంతాల్లో నెమ్మదిగా, అప్రమత్తంగా వాహనం నడపాలని కోరారు.

అలాగే ప్రతి ఆటో డ్రైవర్ వద్ద చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్ సి), ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్ మరియు కాలుష్య నియంత్రణ (పి యు సి) ధృవపత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆటో బ్రేకులు, టైర్లు, లైట్లు, ఇండికేటర్లు, హారన్ తదితర వాటిని తరచూ తనిఖీ చేసి మంచి స్థితిలో ఉంచాలని తెలిపారు. నిర్ణయించిన ఆటో స్టాండ్‌లలో మాత్రమే ఆటోలను నిలపాలని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, అధిక చార్జీలు వసూలు చేయరాదని సూచించారు. అంబులెన్స్, ఫైర్ సర్వీస్, పోలీస్ వాహనాలకు వెంటనే దారి ఇవ్వాలని, వర్షాకాలం మరియు రాత్రి సమయంలో మరింత అప్రమత్తంగా వాహనం నడపాలని కోరారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, బాధితులకు సాధ్యమైనంత సహాయం చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు మరియు ఇతర చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మెగా పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించిన గడివేముల కస్తూర్బా గాంధీ పాఠశాల.



గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలం లోగల కస్తూర్బా గాంధీ పాఠశాలలో మెగా పేరెంట్స్ డే సందర్భంగా పాఠశాలలో పండగ వాతావరణం నెలకొన్నది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ,ఎంఈఓ రాజేంద్రప్రసాద్ , ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ ఏపీ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని అన్నారు. పాఠశాలలో మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం 4.0. ఘనంగా ఉందని తెలిపారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదు ప్రభుత్వ పాఠశాలలో చదవడం వలన అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం వంటి పథకాలకు మొట్టమొదటి అర్హులు మీరు అని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూబియా ఆఫ్రిన్, స్కూల్ చైర్మన్ లక్ష్మీదేవి ,వైస్ చైర్మన్, వెంకట లక్ష్మమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు బాలికలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 24: మెగా పేరెంట్స్ డే సందర్భంగా బండి ఆత్మకూరు





లోని ఎంపీపీ స్కూల్ మెయిన్ నందు శుక్రవారం తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు వెంకటరాయుడు లక్ష్మణస్వామిని పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పాఠశాలలో కమిటీ చైర్మన్ మారాసు వరలక్ష్మి అధ్యక్షతన ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధి కొరకు తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని అన్నారు. తమ విద్యార్థి పాఠశాలకు సక్రమంగా వస్తున్నాడా, లేదా అన్న విషయాలపై శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావడం, డ్రాప్ అవుట్ లేకుండా నమోదును కొనసాగించడం, హాజరు శాతాన్ని పెంచడంలో తల్లిదండ్రుల సహకారం అవసరమని అన్నారు. దీక్ష మరియు లీప్ సహాయ కేంద్రాల ద్వారా డిజిటల్ విద్యా వనరులు మరియు దీక్ష యాప్ పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. టి ఎల్ ఎం, జాదు పిటార, స్పోర్ట్స్ మెటీరియల్ పై ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా చిక్కి మరియు ప్రత్యేక ఎగ్గు కర్రీ తో పాటు పాయసం,వడ్డింపు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో సహపంక్తి భోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద విద్యార్థులు యువకులు శాంతియుతంగా ధర్నా చేస్తున్నటువంటి నేపథ్యంలో లాఠీచార్జ్ చేసి తలలు పగలగొట్టి మహిళలను రోడ్డుపై ఈడ్చికొట్టి, నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసినటువంటి అని దుర్మార్గం అని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా






వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించి నంద్యాలలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసి సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ,ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి,ఏఐటియుసి నంద్యాల పట్టణ కార్యదర్శి ధనుంజయ్, అధ్యక్షులు డి. శ్రీనివాసులు, మహానంది మండల సిపిఐ నాయకులు రాజు గోస్తాడు మండల కార్యదర్శి జిలాని భాష మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ సిపిఐ నాయకులు హరినాథ్ గోకారి మాట్లాడుతూ ఇన్ని రోజుల నుండి విద్యార్థుల భవిష్యత్తుతో సెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ఈనెల 26వ తారీఖున బనగానపల్లెలో జరుగు సిపిఐ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి.

కె ప్రసాద్ సిపిఐ పట్టణ కార్యదర్శి నంద్యాల .




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శిలు లక్ష్మీదేవి భూమని శ్రీనివాసులు ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు ఏ ధనుంజయ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు హరినాథ్ పాల్గొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలు కరువు కాటకాలతో అల్లాడుతూ ఉన్నారు రైతులు అతివృష్టి అనావృష్టితో అనేక ఇబ్బందులు పడుతున్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిపించి యువతకు ఉద్యోగాలు కల్పించాలని, ఇలా అనేక సమస్యలపై ఈనెల 26వ తారీఖున బనగానపల్లె లో జరిగే సిపిఐ విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని నంద్యాల పట్టణ సిపిఐ ప్రజా సంఘాలకు పిలుపునివ్వడం జరిగింది .

**ఈ జనరల్ బాడీ సమావేశమునకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జి ఈశ్వరయ్య , సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కే రామాంజనేయులు , సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరుగుతుంది .**

# ఆదోని మండలంలో విద్యా సంస్థల బంద్ కు ప్రజా సంఘాల మద్దతు.



ఆదోని (పల్లె వెలుగు): నీట్ పరీక్ష లీకేజీ కారణమైన విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బందుకు పిలుపు ఇచ్చిన సందర్భంగా బంద్ కు మద్దతుగా ఆదోని మండలంలోని వివిధ గ్రామాల్లో డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు వీరేష్, చిరంజీవి, హుసేని, లింగన్న,హుసేని ,తాయన్న, దస్తగిరి భాష, రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ కారణమైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.

**విద్యార్థి సంఘాలు చేస్తున్న దేశ,రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు మద్దతుగా నిరసన-- సిఐటియు**

ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు స్థానిక సిఐటియు కార్యాలయం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్, ఉపాధ్యక్షులు లక్ష్మన్న, కృష్ణమూర్తి, మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలు రాస్తున్నటువంటి విద్యార్థులు, పేపర్ లీకేజ్ కావడం వల్ల ఎన్నో ఆశలు పెట్టుకున్న విద్యార్థులకు నిరాశ కలిగించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి యువజన సంఘాల పై బిజెపి ప్రభుత్వం దారుణంగా లాఠీచార్జి చేయడం దేశ ప్రజలందరూ ఖండించాలని అన్నారు, పేపర్ లీకేజీ కి ప్రధాన కారణమైన విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకపోవడం విద్యార్థి యువతలో ఆందోళన నిరసన రూపంలో జరుగుతుందని అన్నారు. విజయవాడ రాజ్ భవన్ ముట్టడిని చేస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకుల పై లాటించాల్సిన ఖండిస్తూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాలు చేస్తున్నటువంటి బందుకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా అన్నారు. కావున తక్షణమే కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సి ముక్కన్న, కే నాగరాజు, ప్రసాద్, చంద్ర, అన్వర్, నాగేష్, భాష తదితరులు పాల్గొన్నారు.




## 40 లక్షలతో మున్సిపల్ కమిషనర్ నూతన క్వార్టర్స్ నిర్మాణం.



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని ఎంఐజి కాలనీ పార్క్ సమీపంలో ఆదోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న మున్సిపల్ కమిషనర్ నూతన క్వార్టర్స్ నిర్మాణానికి ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఈరోజు భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. పార్థసారథి మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధితో పాటు ప్రభుత్వ అధికారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ నూతన క్వార్టర్స్ నిర్మాణం పూర్తయిన అనంతరం అధికారుల పనితీరు మరింత సమర్థవంతంగా ఉండటంతో పాటు పట్టణ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కూడా ఇది దోహదపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మునిసిపల్ ఇంజనీర్ మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.

- **కర్నూలులో హైకోర్టు ఏర్పాటు వరకు పోరాటం కొనసాగిస్తాం**
- **వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో లా నిరాహార దీక్ష.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల న్యాయవాదుల సంక్షేమం, న్యాయవ్యవస్థ బలోపేతం, ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన లా నిరాహార దీక్షలో పలువురు న్యాయవాదులు తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి జూనియర్ న్యాయవాదికి నెలకు రూ.10,000 స్టైఫండ్ అందించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఈ హామీని అమలు చేయాలని కోరారు.

రాష్ట్రంలోని పలు న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, కోర్టు భవనాలు, తాగునీరు, వేచిచూసే గదులు, మరుగుదొడ్లు, డిజిటల్ సౌకర్యాలు వంటి అంశాలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఉచిత న్యాయసేవలు మరింత సులభంగా అందేలా ప్రతి న్యాయస్థానంలో ఉచిత లీగల్ కియోస్క్ బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీని ద్వారా సాధారణ ప్రజలకు న్యాయ సలహాలు, ప్రభుత్వ న్యాయ పథకాలపై అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు.

న్యాయవాదుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక అడ్వొకేట్స్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని, అలాగే విధి నిర్వహణలో ఉన్నా లేదా సహజ మరణం చెందిన ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.10 లక్షల డెత్ బెనిఫిట్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా ప్రతి న్యాయవాదికి ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం కేటాయించి గృహ నిర్మాణ సదుపాయం కల్పించాలని, అలాగే సమగ్ర ఆరోగ్య బీమా (హెల్త్ స్కీమ్) అమలు చేసి వారి కుటుంబాలకు వైద్య భద్రత కల్పించాలని కోరారు.

ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాయలసీమ ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కావాలంటే కర్నూలులో హైకోర్టు ఏర్పాటు అవసరమని, ఆ లక్ష్యం నెరవేరే వరకు ఉద్యమాన్ని విరమించబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరెడ్డి , పార్టీ కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

# నంద్యాలలో వైఎస్సార్సీపీ లీగల్ సెల్ రిలే నిరాహారదీక్ష.

- **న్యాయవాదులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్.**
- **దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి.**
- **జూనియర్ న్యాయవాదులకు నెలకు 10 వేల రూపాయల స్టైఫండ్, 10 లక్షల డెత్ బెనిఫిట్ ఇవ్వాలి.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. “ఎన్నికల సమయంలో న్యాయవాదులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నంద్యాల పట్టణంలో వైఎస్సార్సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి హాజరై పూర్తి సంఘీభావం ప్రకటించారు. సొంత జిల్లాకు చెందిన న్యాయశాఖ మంత్రి సమక్షంలోనే న్యాయవాదులు వీధిన పడే పరిస్థితి రావడం దారుణమని ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.”నంద్యాల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, అసెంబ్లీ అధ్యక్షుడు ప్రతాప్రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ రిలే నిరాహారదీక్షకు లీగల్ సెల్ ప్రతినిధులు, న్యాయవాదులు భారీగా హాజరయ్యారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి చెప్పకుండానే జూనియర్ న్యాయవాదులకు ప్రోత్సాహకంగా నెలకు 5వేల రూపాయల స్టైఫండ్ అందించారని, కానీ కూటమి నేతలు 10వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పారని నాయకులు మండిపడ్డారు.” వెంటనే జూనియర్ న్యాయవాదులకు నెలకు 10వేలు స్టైఫండ్ చెల్లించాలని, న్యాయస్థానాల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని, ఉచిత న్యాయసేవల కోసం ప్రతి కోర్టులో ‘లీగల్ కియోస్క్’లు ఏర్పాటు చేయాలని, న్యాయవాదుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ‘ట్రైనింగ్ అకాడమీ’ నెలకొల్పాలని, మరణించిన న్యాయవాధుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల డెత్ బెనిఫిట్ అందించాలని, అర్హులైన ప్రతి న్యాయవాదికి ఉచిత ఇంటి స్థలాలు కేటాయించాలని న్యాయవాధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ...”కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతీ వర్గం రోడ్డున పడాల్సి వస్తోందని విమర్శించారు. రైతులు గిట్టుబాటు ధరల కోసం, యువత ఉద్యోగాల కోసం, మహిళలు రక్షణ కోసం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. చివరికి న్యాయం పంచే న్యాయవాదులు కూడా తమ హక్కుల కోసం రోడ్డెక్కడం దారుణమన్నారు. సొంత జిల్లాకు చెందిన న్యాయశాఖ మంత్రి ఎన్.ఎండి. ఫరూక్ ఇక్కడ ఉన్నా... న్యాయవాదులకు సమాధానం చెప్పేవారే కరువయ్యారని విమర్శించారు.”

“గతంలో రాయలసీమకు ప్రాధాన్యత ఇస్తూ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తే... ఈ కూటమి ప్రభుత్వం దానిని కూడా నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే విద్యార్థులు, మెడికోలపై కేసులు పెడుతున్నారని ఇది ఎంతో దారుణమైన చర్యలని, తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు న్యాయవాదుల తరఫున వైఎస్సార్సీపీ పోరాడుతుందన్నారు. భవిష్యత్తులో వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే ‘న్యాయవాదుల రక్షణ చట్టం’ తీసుకువస్తామని చెప్పారు.” “కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలతో సహా గౌరవవేతనం విడుదల చేయాలని, న్యాయవాధుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ పోరాటాన్ని రాష్ట్రస్థాయిలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. .

# ఈర్నపాడులో మెగా పేరెంట్స్ డే

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 24: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్న పాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యా కమిటీ చైర్మన్ అన్నెం ప్రతాపరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ వేరకు ప్రతి కుటుంబంలో తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. పాఠశాలలో అధ్యాపకులు చెప్పే బోధనలను విద్యార్థిని విద్యార్థులు శ్రద్ధగా విని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు మాధురి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధనలతో పాటు వారి సమగ్ర వికాసానికి పోషకాహారంతో కూడిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని సమర్థవంతంగా అందిస్తున్నామని అన్నారు. గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో మన పాఠశాల విద్యార్థి షమీర్ 582 మార్పులు సాధించి అత్యుత్తమ ప్రతిభతో పాఠశాల షైనింగ్ స్టార్ గా నిలిచి పాఠశాల ప్రతిష్టను పెంచారని కొనియాడారు. కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా హాజరైన పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా నైతిక విలువలతో కూడిన బోధన అందించినప్పుడే వారు భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడి దేశాభివృద్ధికి పాటుపడతారని దిశా నిర్దేశం చేశారు. ఈ వేడుకల్లో దాతలు మేడ నిరంజన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిట్టం రామకృష్ణారెడ్డి,అన్నెం శ్రీనివాసరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యా కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






### కడమల కాల్వలో

మండల పరిధిలో ఉన్న కడమల కాలవ గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపుకు, విద్యాభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పదవి విరమణ ఉపాధ్యాయులు యేసురత్నం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాగాల వెంకటరమణ, ఎద్దుల సుబ్బరాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# దీబగుంట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా
# "మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎమ్ 4.0)"

☛ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.

☛సమావేశం అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన మంత్రి ఫరూక్.



పల్లె వెలుగు గోస్పాడు. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) ఆవరణలో శుక్రవారం నాడు సమగ్ర శిక్ష మరియు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పిల్లల బంగారు భవిష్యత్ కోసం బడి వైపు ఒక అడుగు అనే నినాదంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీమ్ 4.0) కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉపాధ్యాయులు-తల్లిదండ్రులు సమన్వయంతో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశం ముగిసిన అనంతరం మంత్రి ఫరూక్ పాఠశాల విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి, వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కూర్చొని ఎంతో ఆత్మీయంగా మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించి, వంట ఏ విధంగా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రి స్వయంగా తమతో కలిసి భోజనం చేయడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి. నాగలక్ష్మి , మండల ఉపాధ్యక్షులు పి. జనార్ధన్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారి కరీం సాబ్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, ఉర్దూ స్కూల్ ఇన్స్పెక్టర్ అస్మద్దీన్ , ఈఈ నాగరాజు, డిప్యూటీ ఎంపీడీఓ టి. శివప్రసాద్ , డాక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ సుబ్బయ్య , పంచాయితీ సెక్రటరీ సుబ్బయ్య, ప్రముఖ కళాకారుడు







ఎం. శంభుప్రసాద్, దీబగుంట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా విద్యా
# సంస్థల బంద్ విజయవంతం

☛ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

☛ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, బీసీ జనసేన విద్యార్థి విభాగం

ఆదోని (పల్లె వెలుగు): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ ఘటనపై



కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యుడు ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు బిలాల్, బీసీ జనసేన విద్యార్థి విభాగం నాయకులు అఖిల్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించడం విద్యార్థుల ఆందోళనకు లభించిన మద్దతుకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధంగా పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడం బాధాకరమని విమర్శించారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

# ప్రజా సమస్యల పోరాటానికి సిద్ధం సిపిఐ



(జులై 24పల్లెవెలుగు న్యూస్) ప్రతినిధి: - రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను,విస్మరించిందని సిపిఐ అవుకు మండల కార్యదర్శి,నాగాంజనేయులు విమర్శించారు. ఈ నెల 26వ తేదీన బనగానపల్లెలో నిర్వహించే సిపిఐ నంద్యాల జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాట కార్యాచరణను రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య గారితో పాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరు అవుతారు ఈసమావేశంలో నిరుద్యోగులకు జాబు క్యాలెండర్ విడుదల చేయకపోవడం బలవంతపు భూసేకరణ పెండింగ్ ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు 26వ తేదీన జరిగే సమావేశానికి మండలంలోని రైతు సంఘాలు పార్టీ శ్రేణులు ప్రజా సంఘాల నాయకులు మహిళలు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుచున్నాను కార్యక్రమములో అవుకు సీపీఐ నాయకులు రమేష్ సునీల్ పుల్లయ్య సాయి అలాగే రైతు సంఘం నాయకులు మద్దిలేటి రామచంద్రుడు నాగేష్ రామాంజనేయులు పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

# జీకే క్లినిక్స్ ఆధ్వర్యంలో మొబైల్ యాప్ ద్వారా
# ప్రజలకు మరిన్ని సేవలు.

☛ఆదోని 'జీకే క్లినిక్స్' మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి.జి. రోహిత్

☛ప్రతి శుక్రవారం జీకే క్లినిక్స్‌లో డాక్టర్ రోహిత్ సేవలు

☛యాప్ ద్వారా ఇంటి నుంచే ఓపీ, ఉచిత సెకండ్ ఒపీనియన్ సదుపాయం

ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఆదోని పట్టణంలోని ప్రముఖ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి 'జీకే క్లినిక్స్' ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసే దిశగా సరికొత్త మొబైల్ అప్లికేషన్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించింది. ప్రముఖ ఆర్.ఆర్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి.జి. రోహిత్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ నూతన యాప్‌ను లాంచ్ చేశారు. రోగులు ఆసుపత్రి వద్ద వేచి ఉండే శ్రమను తగ్గిస్తూ, డిజిటల్ టెక్నాలజీ సాయంతో అత్యుత్తమ సేవలు అందించేలా ఈ యాప్‌ను తీర్చిదిద్దారు.

నూతన యాప్ లోని ముఖ్య సదుపాయాలు ఇవే

డాక్టర్ల లభ్యత మరియు ఆన్‌లైన్ ఓపీ ఆసుపత్రిలో ఏ డాక్టర్ ఏ రోజు అందుబాటులో ఉంటారో ఈ యాప్ ద్వారా ముందుగానే తెలుసుకోవచ్చు. రోగులు ఎక్కడి నుంచైనా సరే, తమ ఇంటి వద్ద నుంచే సులభంగా తమకు కావాల్సిన డాక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఓపీ బుక్ చేసుకోవచ్చు.ఆరోగ్య వివరాలు, ల్యాబ్ రిపోర్ట్స్ భద్రం రోగులు తమ పూర్తి ఆరోగ్య వివరాలను, ల్యాబ్ రిపోర్టులను ఈ యాప్‌లో పొందుపరుచుకునే సదుపాయం ఉంది. దీని ద్వారా భవిష్యత్తులో మెడికల్ హిస్టరీ ఎప్పటికప్పుడు డాక్టర్లకు సులభంగా అందుబాటులో ఉంటుంది.ఉచిత 'సెకండ్ ఒపీనియన్'ఏదైనా అనారోగ్య సమస్య ఉన్నా లేదా వేరే ఎక్కడైనా ఆపరేషన్ చేయించుకోవాలని చెప్పినా రోగులు తమ పాత లేదా కొత్త రిపోర్టులను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేసి నిపుణులైన డాక్టర్ల నుంచి ప్రత్యేకంగా 'ఉచిత సెకండ్ ఒపీనియన్' (ఫ్రీ





సెకండ్ ఒపీనియన్) తీసుకోవచ్చు.

ఉచిత గైడెన్స్ మరియు ఇన్సూరెన్స్ సలహాలు రోగులు రిపోర్ట్స్ అప్‌లోడ్ చేస్తే చాలు, జీకే క్లినిక్స్ సిబ్బందే స్వయంగా రోగిని ఫోన్ ద్వారా సంప్రదిస్తారు. ఆపరేషన్ అవసరమా? ఆ ఆపరేషన్‌కు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందా లేదా? మరియు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం ఎలా పొందాలి అనే పూర్తి సమాచారాన్ని ఆసుపత్రి బృందం ఉచితంగా వివరిస్తుంది. ఇది సామాన్యులకు ఉచిత ఆన్‌లైన్ కన్సల్టేషన్‌లా ఉపయోగపడుతుంది.

ప్రతి శుక్రవారం డాక్టర్ బి.జి. రోహిత్ సేవలు యాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి.జి. రోహిత్ మాట్లాడుతూ ప్రజలు ఈ యాప్ ద్వారా పొందే సేవలను వివరించారు. అలాగే, రోగుల సౌకర్యార్థం డాక్టర్ బి.జి. రోహిత్ గారు ఇకపై ప్రతి శుక్రవారం ఆదోనిలోని జీకే క్లినిక్స్‌లో




అందుబాటులో ఉంటారని యాజమాన్యం తెలియజేసింది.

అత్యాధునిక సాంకేతికతను సామాన్యులకు సైతం అందుబాటులోకి తెస్తూ. వైద్య సేవల్లో పారదర్శకతను పెంచేలా ఆదోనిలో జీకే క్లినిక్స్ చేపట్టిన ఈ వినూత్న విధానం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం రాకకు సిద్ధమవుతున్న ఆస్పరి ప్రజావేదిక.

-సంజీవిని ఆసుపత్రిని పరిశీలించిన రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప.

ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలానికి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 25వ తారీకు విచ్చేస్తున్నారు సంజీవిని హాస్పిటల్ ఓపెనింగ్ మరియు కార్యకర్తల సమావేశం ప్రజా వేదిక నిర్వహిస్తారు అందుకుగాను ఆస్పరి మండలం ముమ్మారంగా అతివేగంగా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి ఈరోజు రాష్ట్ర కురుబ కురుమ కార్పోరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప మరియు కర్నూల్ పార్లమెంట్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఆలూరు ఇంచార్జ్ వైకుంఠం జ్యోతితోపాటు పరిశీలించినారు ఏ ఇబ్బంది లేకుండా అన్ని పనులు సకాలంలో జరుగుతాయని తెలుసుకున్నారు కలెక్టర్ సిరి కూడా పర్యవేక్షించారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ వచ్చి రెండు సంవత్సరములో రాయలసీమకు పెట్టుబడుల వర్షాలు కురిపించిన ఘనత చంద్రన్నకే తగ్గుతుంది అంతేకాదు ఇరిగేషన్ విషయంలో పెట్టుబడి విషయంలో చాలా సున్నితంగా రాయలసీమకు ఎంతో కృషి చేస్తున్నారు రాయలసీమ పశ్చిమ ప్రాంత మైన కర్నూలు జిల్లా వెనుకబడిన జిల్లా ఇక్కడ ప్రజలు వలసలు తప్ప సాగు చేసేకి వాన లేక లాడుతున్న రైతులకు ముఖ్యంగా ఆలూరు ఆదోని పత్తికొండ ఎమ్మిగనూరు మంత్రాలయం నియోజకవర్గం లో వేదవతి ప్రాజెక్టు ఆ ప్రాజెక్టు కూడా వచ్చే మూడు సంవత్సరంలో సాధిస్తామని పేర్కొన్నారు సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిని దేశంలోనే నంబర్ వన్ గా తిది తీరుస్తున్నారు అని చైర్మన్ మీడియాతో మాట్లాడడం జరిగింది.

# జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో మెరిసిన విజయవాడ వైద్యురాలు.



పల్లె వెలుగు విజయవాడ. మహారాష్ట్ర ఔరంగాబాద్‌లో ఈ నెల 18 నుంచి 23 వరకు జరిగిన జాతీయ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026లో విజయవాడకు చెందిన వైద్యురాలు బిందు పరుచూరి డెడ్ లిఫ్ట్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు.

డెడ్ లిఫ్ట్ పోటీల్లో బిందు మాస్టర్స్-1(40-50 ఏళ్లలోపు), 84 కేజీల కేటగిరీలో తలపడి 147.5 కేజీల బరువెత్తి ద్వితీయ స్థానంలో నిలిచారు.

ఇటీవల విజయనగరం జిల్లా రాజాంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకాన్ని కైవసం చేసుకోవడం ద్వారా జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఏడాది సాధన అనంతరం తొలిసారి తలపడిన జాతీయ డెడ్ లిఫ్ట్ పోటీల్లో రజత పతకం సాధించడం విశేషమని పలువురు వైద్యులు, లిఫ్టర్లు పతకం సాధించిన బిందుని అభినందించారు.

# సమాజంలో గుడి కంటే బడికే ప్రాధాన్యత: తహశీల్దార్

మహానంది, పల్లె వెలుగు సమాజంలో గుడి ,బడి ఎంతో అవసరమని అయితే వీటిలో గుడి కంటే బడికే ప్రాధాన్యత ఉంటుందని తహసిల్దార్ రామాదేవి పేర్కొన్నారు.శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ కార్యక్రమంలో భాగంగా మహానంది మండలంలోని బుక్కాపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం సృష్టించడానికి బడి ప్రధాన కేంద్రంగా ఉంటుందని బడిలో నేర్చుకున్న చదువు, నైతిక విలువలు, సామాజిక స్పృహ, దేశభక్తి, సేవా దృక్పథం వంటి మానసిక పరిపక్వత బడిలో రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు.విద్యార్థులకు పుస్తకాలు పలకలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన తహసిల్దార్ రమాదేవిని ఘనంగా సన్మానించారు.అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మొదటి సంవత్సరం చేర్పించిన 18 మంది విద్యార్థుల తల్లులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



## బుజనూరు స్వర్ణ గ్రామాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ రాజకుమారి గనియా.

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక.. నంద్యాల జిల్లా గడివేముల మండలం బుజనూరు స్వర్ణ గ్రామాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనీయా



గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల తనిఖీ నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామంలో తాగునీరు సరఫరా, పచ్చదనం పెంపు, ఘన వ్యర్థాల నిర్వహణ, తదితర అంశాల పైన ఆమె గ్రామ సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంకా అభివృద్ధి పనులను వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరము మెగా పేరెంట్స్ నిర్వహణ గురించి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు . ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు దిలీప్ కుమార్ రెడ్డి, స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు బీహార్ చైన్ స్నాచెర్స్ అరెస్ట్.

**రూ. 1,40,000/- నగదు స్వాదీనం.**



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. గత నెల కర్నూలు నాలుగో పట్ట ణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఉల్చాల రోడ్డు ఆదిత్య నగర్లో ఒక వివాహిత ఉదయం 7 గంట ల సమయంలో పాల ప్యాకెట్ కొనుక్కొని రావడానికి గాను దగ్గర్లోని కిరాణా షాప్ కి వెళ్ళగా ఇంతలో గుర్తు తెలియని ఇద్దరు మగ వ్యక్తులు ఒక మోటార్ సైకి ల్ మీద సదరు మహిళలు సమీ పించి తన మెడలో ఉన్నటువంటి సుమారు 2 తులాల బంగారు పుస్తెల గొలుసును లాక్కొని వెళ్లారు .ఆ ఫిర్యాదు పై కేసు నమోదు పరచి, అందుబాటులోని జజుఎ ఫుటేజ్ లను పరిశీలించి,జ× విక్రమ్ సింహ ఆధ్వర్యంలో సాంకేతి క పరిజ్ఞానంతో, బీహార్ రాష్ట్రం క్రైమ్ డిటేక్టివ్ టీంలతో సంప్రదిం చి, సదరు బంగారు గొలుసును దొంగలించిన వారిని బీహార్ రాష్ట్రం పాట్నా, బకార్గంజ్ కి చెందిన,రవి కుమార్ కేశరి, దీప్ కుమార్ ఏ అంకిత శర్మ లుగా గుర్తించారు. ూ× చంద్ర శేఖర్ రెడ్డి, ూ× పోసా శ్రీనివాసులు, ఎజ జీన స్,ూజ శ్రీనివాసులు,ూజ మురళీధర్ లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వారి ఇద్దరినీ గాలించి పాట్నా లో అరెస్ట్ చేశారు. వారి నుండి బంగారు గొలుసు ఇతరు లకు అమ్ముకోగా వచ్చిన 1,40,000/- రూపాయలను స్వాదీనం చేసుకొని రిమాండ్ నిమిత్తం గౌరవ మేజిస్ట్రేట్ గారి ముందు హాజరు పరచడమైనది.

## యధావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 24: బండి ఆత్మకూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు యధావిధిగా సాగిస్తున్నామని సబ్ రిజిస్ట్రార్ ఆదినారాయణ శుక్రవారం పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్ల సమ్మె కొనసాగుతున్నప్పటికీ రిజిస్ట్రేషన్ సేవలలో ప్రజలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరమయ్యే అన్ని సేవలను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పబ్లిక్ డేటా ఎంట్రీ కౌంటర్లను ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ లను అందిస్తున్నామని తెలిపారు. ఎన్కంబరెన్స్ సర్టిఫికెట్లు రిజిస్ట్రేషన్ తో పాటు వివిధ రకాల సేవలు అన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోవులకు గురికావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయం సందర్శించి తమ పనులను పూర్తి చేసుకోవచ్చని సబ్ రిజిస్ట్రార్ నారాయణ వివరించారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పక డ్బందీ ఏర్పాట్లు.



పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. ఆస్పరిలో హెలిప్యాడ్,సభా ప్రాం గణం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించిన కర్నూలు ఎస్పీ .ఈ నెల 25వ తేదీన ఆస్పరి మం డల కేంద్రంలో నిర్వహిం చనున్న "సంజీవని" కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు వార ప్రారంభించను న్న నేపథ్యంలో భద్రతా, ఇతర ఏర్పాట్లను కర్నూలు ఎస్పీ విక్రాం త్ పాటిల్ శుక్రవారం క్షేత్ర స్థాయి లో పరిశీలించారు.ఈ సందర్భం గా హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం, వాహనాల పార్కిం గ్ ప్రాంతం, ప్రజల రాకపోకల మార్గాలు, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్ల ను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశా రు.ముఖ్యమంత్రి పర్య టన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశిం చారు. ప్రజలకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా ట్రాఫిక్, భద్ర తా ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని సూ చించారు.ఈ పరిశీలనలో కర్నూలు ఎస్పీ వారితో పాటు అడిషనల్ ఎస్పీలు హు స్సేన్ పీరా, కృష్ణమోహన్ డీఎస్పీలు, సిఐ లు, సంబంధిత పోలీసు అధికా రులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హైస్కూల్ అభివృద్ధికి సహకరిస్తాం.

**30వేలు విరాళం అందించిన.మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ.**



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అమరావతి నగర్ కాలనీ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ మౌలిక సదుపాయాల కోసం శక్తి వంచన లేకుండా తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈరోజు అమరావతి నగర్ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిపి మెగా పేరెంట్స్ డే హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డివి వెంకట సుబ్బారెడ్డి అధ్యతన నిర్వహించడం జరిగింది.ఈ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అమరావతి హైస్కూల్ లో చదివే పిల్లలు మంచి మార్కులు సాధిస్తూ బాగా చదువుకుంటున్నారని కాకపోతే పిల్లలు ఎక్కువగా ఉన్నారని పిల్లలకు తగినన్ని క్లాసు రూములు లేవని అలాగే సరైన మౌలిక సదుపాయాలు కూడా లేవని వాటిని సమకూర్చ గలిగితే ఇంకా మెరుగైన ఫలితాలను మా పాఠశాల తరుపున సాధించ గలుగుతామని, కనుక మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ మా స్కూల్ సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.అంతేకాకుండా స్కూల్ కంప్యూటర్ లేదని, అందువల్ల విద్యాబోధనలో కొంత వెనకబడ్డామని తెలిపారు.వెంటనే స్పందించిన మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ కంప్యూటర్,ప్రింటరు తెప్పించుకోవాలని 30వేల రూపాయల చెక్కును ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అందచేసారు.ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ మాపై నమ్మకముంచి మాకు ఓట్లు వేసి గెలిపించిన అమరావతి నగర్ వార్డు కోసం ఎంత చేసినా తక్కువే అవుతుందని లలితమ్మ తెలిపారు.ఒకటిన్న సంవత్సరాల కాలములో ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి సహకారంతో దాదాపు కోటి డెబ్బై లక్షల రూపాయల వరకు రోడ్లు డ్రైనేజీలు వేయడం జరిగిందని తెలిపారు.

అంతేకాకుండా అమరావతి నగర్ పంపుహౌస్ చుట్టూ కాంపౌండ్ వాల్ కోసం 10లక్షల రూపాయలు, 20లక్షల రూపాయల ఖర్చుతో సిసి రోడ్డును ఎమ్మెల్యే పార్థన్న సహకారంతో మంజూరు చేయించడం జరిగిందని.వారం రోజుల లోపల కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం జరుగుతుందని మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ తెలిపారు.ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు శివజ్యోతి, విజయభాస్కర్,ప్రసన్నకుమారి, మహబూబ్ సుబాని,నరశింహులు, రమేష్ నాయక్, శివ కుమార్, విజయమోహన్ తో పాటుగా స్కూల్ కమిటీ చైర్మన్ గీత, వైస్ చైర్మన్ విజయరాజు,బిజెపి నాయకులు వెల్లాల మధుసూధనశర్మ, పరుశురాం, టిడిపి నాయకుడు మహమ్మద్ భాషా పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం .

*-ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి.*

ఆదోని (పల్లె వెలుగు): ప్రజల సమస్యలను నేరుగా







తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ప్రజల కోసం... మీ పార్థసారథి" కార్యక్రమంలో భాగంగా ఆదోని పట్టణంలోని 31వ వార్డు సచివాలయం పరిధిలోని గౌళిపేట్, వడ్డే గేరి ప్రాంతాల్లో గౌళిపేట్ ఆటో స్టాండ్ నుండి ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు ఎమ్మెల్యేను కలిసి హర్షం వ్యక్తం చేస్తూ, పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడేలా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని అభినందించారు.

స్థానికులు ప్రధానంగా ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు కాలువల ద్వారా ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారం కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సీసీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి సామాజిక భద్రతా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ప్రజల వినతులపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి గారు మున్సిపల్ అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా కార్యాచరణ రూపొందించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు, విద్యుత్ స్తంభాల మార్పిడి వంటి అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదేశించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా పెన్షన్ దరఖాస్తులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. ప్రతి వార్డులో ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని దశలవారీగా పరిష్కరించడమే "ప్రజల కోసం... మీ పార్థసారథి" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లోటు లేకుండా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, బీజేపీ నాయకులు నిర్మల,మణికంఠ,శివ రాజ్,టీడీపీ నాయకులు బీటీ శ్రీనివాసులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నంది రైతు సమైక్య నూతన కార్యాలయాన్ని పున ప్రారంభించిన వైసిపి నాయకులు నంది రైతు సంఘం నాయకులు.

**నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శిల్పా సహకార్ మూసివేతపై తీవ్ర ఆగ్రహం.**
**మంత్రి ఫరూక్‌పై విమర్శల బాణాలు.. రోడ్ల వెడల్పు నష్టపరిహారంలో స్వార్థపూరిత నిర్ణయాలని ఆరోపణ.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల





రాజకీయం మరోసారి వేడెక్కింది. ఇటీవల వ్యవసాయ మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 'శిల్పా సహకార్ సూపర్ మార్కెట్'ను కూటమి నేతలు ఉద్దేశపూర్వకంగా ఖాళీ చేయించడంపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ఘాటుగా స్పందించారు. శిల్పా సహకార్ ఉద్యోగుల గురించి కూటమి నేతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి ఉపాధి బాధ్యత తమదేనని స్పష్టం చేశారు. స్థానిక కూటమి నాయకులు అపద్దపు వాగ్దానాలు మానుకుని, తమ స్వంత కార్యకర్తల పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని హితవు పలికారు. నంద్యాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కూటమి ప్రభుత్వం మరియు స్థానిక నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్‌లో నడుస్తున్న శిల్పా సహకార్ సూపర్ మార్కెట్‌ను పట్టుబట్టి మూసివేయించారని ఆరోపించారు.

ఈ సంధర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ...సూపర్ మార్కెట్ మూసివేత వల్ల 40 కుటుంబాలు ఉపాధి కోల్పోవడం బాధాకరమని, అయితే ఆ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే బాధ్యత పూర్తిగా శిల్పా కుటుంబానిదేనని హామీ ఇచ్చారు. ఉద్యోగాలు ఇస్తామంటూ కూటమి నేతలు మోసపు వాగ్దానాలు చేస్తూ రాజకీయం చేయడం తగదని మండిపడ్డారు.నంద్యాల పట్టణంలో మంత్రి ఫరూక్‌లాగా శిల్పా కుటుంబానికి భూములు, స్థలాలు లేవని విమర్శించారు. శిథిలావస్థలో ఉన్న టెక్కె వ్యవసాయ మార్కెట్ దుకాణాలను తమ సొంత నిధులతో మరమ్మతు చేయించి, అక్కడే శిల్పా సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. రోడ్ల వెడల్పు నష్టపరిహారం చెల్లింపులో అధికారంలో ఉన్నవారు స్వార్థంగా వ్యవహరించారని ఆరోపించారు. ఒకవైపు ఒక రేటు, మరోవైపు వేరొక రేటు నిర్ణయించారని, దీనివల్ల ఎక్కువ లబ్ధి మంత్రి ఫరూక్‌కే చేకూరిందన్నది వాస్తవం కాదా అని సూటిగా ప్రశ్నించారు. రోడ్ల నిర్మాణానికి స్థలాలు ఇచ్చిన వారిలో కేవలం మంత్రి ఫరూక్ మాత్రమే లేరని, అనేకమంది ప్రజలు ఉన్నారని తెలిపారు. కడప, కర్నూలు రహదారుల అనుసంధానం కోసం శిల్పా కుటుంబానికి చెందిన 6 ఎకరాల స్థలాన్ని ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మార్కెట్ యార్డ్‌లో 40 ఉద్యోగాలు ఉన్నాయని చెబుతున్న కూటమి నేతలు, ఆ ఉద్యోగాలను వెంటనే తమ సొంత కూటమి కార్యకర్తలకు కేటాయించి అధికారికంగా ప్రకటించాలని సవాల్ విసిరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి , ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ పీ పీ నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు బెక్కం రామసుబ్బారెడ్డి, రాష్ట్ర సిఇసి మెంబర్ దేశం సుధాకర్ రెడ్డి, నంది రైతు సమైక్య సభ్యులు కొండ మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి ,చంద్రశేఖర్ రెడ్డి వైసిపి నాయకులు ప్రహ్లాద రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వైసిపి జిల్లా కమిటీ సభ్యులు హరిగ్రీవాచార్యులు మరియు రైతు సంఘం నాయకులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు.

## మూడవ పట్టణ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ .





పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా పోలీసు శాఖ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, సమాజంలో నేరాల నివారణతో పాటు ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాలమేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర విద్యాసంస్థల్లో సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు భద్రత, కొత్త చట్టాలు, శక్తి యాప్, అత్యవసర సేవల వినియోగం తదితర అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా నంద్యాల మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నంద్యాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, విద్యార్థినుల కోసం మహిళల భద్రత మరియు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకు కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, మొబైల్ ఫోన్, సోషల్ మీడియా, ఇంటర్నెట్ వినియోగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులు, ఉద్యోగాలు, బహుమతులు, లోన్‌లు లేదా పెట్టుబడుల పేరుతో వచ్చే ఆఫర్లను నమ్మి వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు, ఓటీపీలు లేదా పాస్‌వర్డులు ఎవరికీ వెల్లడించరాదని సూచించారు.

మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ, సైబర్ స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్స్ సృష్టించడం, ఫోటోలు మార్ఫింగ్ చేయడం, అసభ్యకర సందేశాలు పంపడం, బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్ వంటి చర్యలు చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని వివరించారు. ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మహిళల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ రూపొందించిన శక్తి యాప్ వినియోగంపై విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్‌లోని ఎస్‌ఓఎస్ (ఎస్ ఓ ఎస్) బటన్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం చేరుతుందని, ప్రతి మహిళ తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని సూచించారు.

సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని, అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. త్వరితగతిన ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు.

అదేవిధంగా ఏదైనా అత్యవసర పరిస్థితి, ప్రమాదం, మహిళలపై వేధింపులు లేదా ఇతర నేర సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు వెంటనే డయల్-112కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు తక్షణ పోలీసు సహాయం అందించేందుకు ఈ సేవ 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని సూచించారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ మరియు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు పరిసర ప్రాంత ప్రజలకు కూడా సైబర్ భద్రత, మహిళల భద్రత, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. సమాజంలో జరిగే నేరాలను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, పోలీసు శాఖతో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం: డీసీఎంస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్

- **మెట్టుపల్లిలో ఉచిత యూరియా, వేరుశనగ విత్తనాల పంపిణీ**
- **ముఖ్య అతిథిగా హాజరైన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి**



పల్లె వెలుగు -ప్యాపిలి రైతుల సంక్షేమమే ధ్యేయంగా నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందని, తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షపాతేనని డీసీఎంస్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. ప్యాపిలి మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో శుక్రవారం రైతులకు ఉచిత యూరియా వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులైన రైతులకు ఉచిత విత్తనాలు ఎరువులను అందజేశారు.

?రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కోట్ల

?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ...

?రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.డి ఏ పి యాప్ ద్వారా రైతులు సాగు చేసే పంటల ఆధారంగా, ఎకరాకు ఎన్ని బస్తాల ఎరువు కావాలో పారదర్శకంగా నిర్ణయించి పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ప్రతి ఒక్క రైతు డ్రిప్ ఇరిగేషన్ సాంకేతికతను ఉపయోగించుకోవాలని, పంట నష్టాల నుండి రక్షణ పొందేందుకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు.డోన్ నియోజకవర్గంలో ప్రతి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

?ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ సునీత ఎంపీడీఓ శ్రీనివాసులు,తహశీల్దార్ భారతి,సీఐ వెంకట్రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రేణుక,మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మెట్టుపల్లి సుదర్శన్,కొంగన పల్లె మధు గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# కూరగాయలతో శాకాంబరిగా దర్శనమిచ్చిన వాసవీ మాత..

## - అమ్మవారికి సామూహికంగా సారే సమర్పించిన మహిళలు





రుద్రవరం. పల్లె వెలుగు : అమ్మవారి ఆరాధనకు, ప్రత్యేకించి ప్రకృతిని పూజించే శుభప్రదమైన ఆషాఢ మాసం విశిష్టతను పురస్కరించుకుని, పవిత్రమైన ఆషాఢ శుక్రవారం రుద్రవరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో 'శాకాంబరి'గా అత్యంత సుందరంగా అలంకరించారు. ఈ మాసంలో అమ్మవారిని శాకాంబరిగా దర్శించుకుంటే కరువు కాటకాలు తొలిగి, పాడిపంటలు వృద్ధి చెందుతాయని భక్తుల విశ్వాసం; అందులో భాగంగానే ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి చీరె, సారె సమర్పించగా, ఆలయ అర్చకులు రామడుగు విశ్వనాథ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు ప్రసాదం స్వీకరించారు. ఈ భక్తిపూర్వక వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ వంకదార శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ నల్లగట్ల వెంకటేశ్వర్లు, కోశాధికారి నల్లగట్ల వెంకట సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం పెద్దలు లింగ వెంకట రంగ నాయకులు, చోళవేటి వెంకట శెట్టి, పెరుమాళ్ళ నరసింహయ్య, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉప కార్యదర్శి పెరుమాళ్ళ వెంకట సురేంద్ర, కమిటీ సభ్యులు, యువజన సంఘం సభ్యులతో పాటు రుద్రవరం గ్రామ, మండల ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత...

- **కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.**
- **1,500 మంది పోలీసులతో పటిష్ట భద్రత.**
- **సెక్టర్ల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేసిన... ఎస్పీ.**
- **డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్, మఫ్టీ పోలీసు బృందాలు అప్రమత్తంగా ఉండాలి.**

పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. ఈ నెల 25వ తేదీన ఆస్పరి మం డల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నాయుడు వారు "సంజీవని" కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటి ష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

ఈ సందర్భంగా బందోబస్తు విధు ల్లో పాల్గొనే పోలీసు అధికారులు సిబ్బందికి కర్నూలు ఎస్పీ ఆస్పరి మండల కేంద్రం లో శుక్రవారం సెక్టర్ల వారీగా దిశానిర్దేశంచేశారు.

ప్రతి పోలీసు అధికారి, పోలీసు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన కోసం 1,500 మంది పోలీసు సిబ్బం దిని భద్రతా విధుల్లో నియమిం చారు. వీరిలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 34 మంది సీఐలు, 76 మంది ఎస్సైలు, 226 మంది ఏఎస్ ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 353 మంది కానిస్టేబుళ్లు, 95 మంది మహిళా పోలీసులు, 127మంది హోంగార్డులు, 30 మంది మహి ళా హోంగార్డులు, ఏఆర్, ఏపీ ఎస్పీ, స్పెషల్ పార్టీ సిబ్బంది ఇతర జిల్లాల పోలీసులు ఉన్నా రు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, వీఐపీ మార్గాలు,పార్కింగ్ ప్రాం తాలు తదితర ప్రాంతాల్లో నిరం తర నిఘా కొనసాగించాలని, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, మఫ్టీ పోలీసు బృందా లు ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ పూర్తి అప్రమత్తత తో విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. అన్ని విభా గాల అధికారులు పరస్పర సమ న్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముఖ్యమంత్రి పర్యట నను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు శ్రీ హుస్సేన్ పీరా గారు, కృష్ణ మోహన్ , డీఎ స్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సై లు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నా రు.





# ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి: టీజీపీ ఈఈ ఎం. మురళీకృష్ణ

## గ్రామాల్లో చాటింపు వేయించాలని నీటి సంఘాల అధ్యక్షులకు ఆదేశం



రుద్రవరం. పల్లె వెలుగు : తెలుగుగంగ ప్రాజెక్ట్ ఆయకట్టు కింద ఈ ఏడాది రైతులు వరి సాగు చేయవద్దని, ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని టీజీపీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. మురళీకృష్ణ సూచించారు. ఆయన ఆధ్వర్యంలో టీజీపీ డివిజన్ కార్యాలయంలో వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఎల్-నినో ప్రభావం ఉన్నందున నీటి రాక తగ్గిపోయే ప్రమాదం ఉందని వివరించారు. ఈ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, తెలుగుగంగ కాలువ కింద రైతులు వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయంగా జొన్న, కొర్ర, సజ్జ, కంది వంటి ఆరుతడి పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాలని నీటి సంఘాల ప్రతినిధులకు సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోకుండా ముందస్తుగా వరి వేయకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కీలక సమాచారాన్ని రైతులందరికీ చేరవేసేలా నీటి సంఘాల అధ్యక్షులు వారి వారి గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు వేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తెలుగు గంగ అధికారులు సాగునీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

# వైభవంగా దొర్నిపాడు జడ్పీ పాఠశాలలోపేరెంట్స్ డే







దొర్నిపాడు జూలై 24 పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలోశక్రవారంప్రధానోపాధ్యాయురాలుచెన్న కేశ్వరిఆధ్వర్యంలో వైభవంగా పేరెంట్స్ డే ,టీచర్ల సమావేశము నిర్వహించారు, ఈ సమావేశానికి జడ్పీటీసీ శకుంతల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ,విద్యార్థు లు తల్లిదండ్రులుహాజరయ్యారు, తల్లిదండ్రులు ,విద్యార్థులకు బాల్యవివాహాలనివారణ, ఫోక్సోచట్టం ,పిల్లల హక్కు ,చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 పైవక్తలు అవగాహన కల్పించారు,ఈసందర్భంగా పాఠశాలప్రధానోపాధ్యాయురాలుచెన్న కేశ్వరి మాట్లాడుతూ చదువే బాలల భవిష్యత్తుకు పునాది అన్నారు, 18 సంవత్సరాల లోపు బాలికలకు 21 సంవత్సరాల బాలురకు వివాహాలు చేయడం నేరమన్నారు ,బాల్య వివాహం వల్ల బాలికల విద్య, ఆరోగ్యము మానసిక వికాసము,పూర్తిగా దెబ్బతింటుందన్నారు ,పిల్లలపై ఎలాంటి హింస, లౌంగిక వేధింపులు, బాల్యవివాహము బాల కార్మికులుగా మార్చే ప్రయత్నాలు జరిగిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్1098 నెంబర్ కు సమాచారం అందించాలని విద్యార్థి విద్యార్థులకు తెలియజేశారు,పిల్లలభవిష్యత్తుకుమొదటిప్రాధాన్యత ఇవ్వాలన్నారు, వారి హక్కులను కాపాడుతూ వారికి మంచి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వారన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందము విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్లో మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్...






రుద్రవరం, పల్లె వెలుగు : రుద్రవరం మోడల్ స్కూల్ ఉ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ (వీపీవీ 4.0) కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పిల్లల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ఉపాధ్యాయులతో ముఖాముఖి చర్చించారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ శ్రీ రెహ్మాన్ , తువ్వపల్లె నాయకుడు శ్రీ యువరాజు , చైర్మన్ శ్రీ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ, విద్యార్థుల జీవిత నిర్మాణంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల చదువు, హాజరు, ప్రవర్తనపై నిరంతరం దృష్టి సారించాలని, పాఠశాలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా పురోగతి, పరీక్షల ఫలితాలు, హాజరు శాతం, అభ్యాస సామర్థ్యం, సహపాఠ్య కార్యక్రమాలు, క్రీడలు, సైన్స్, ఇన్నోవేషన్ కార్యక్రమాలు, అటల్ టింకరింగ్ ల్యాబ్ కార్యకలాపాలు వంటి అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థి సంక్షేమ పథకాల గురించి కూడా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయ బృందం సమిష్టిగా కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అత్యంత అవసరమని, ప్రతి విద్యార్థి లక్ష్యసాధనలో కుటుంబం మరియు పాఠశాల కలిసి పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన వీపీవీ 4.0 కార్యక్రమం పాఠశాల--తల్లిదండ్రుల మధ్య మరింత బలమైన అనుబంధాన్ని ఏర్పరుస్తోందని పేర్కొన్నారు. రెహ్మాన్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా ప్రగతిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ఇంటి వద్ద కూడా చదువుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నారని, పాఠశాలలో అమలు చేస్తున్న వినూత్న విద్యా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, క్రమశిక్షణా విధానాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో వ్యక్తిగతంగా సమావేశమై తమ పిల్లల విద్యా ప్రగతి గురించి చర్చించి విలువైన సూచనలు అందించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, అధికారులు,తల్లిదండ్రులు, మీడియా మిత్రులు, పెద్దలు,పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బందికి ప్రిన్సిపాల్ శ్రీ సంగేపు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రజనీ ఉపాధ్యాయులు ,విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి




బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి (జులై 24 ):- బేతంచెర్ల మండలం కొలుములపల్లె గ్రామంలో శు క్రవారం నీట్ పేపర్ లీకేజీని తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ టార్చ్‌లైట్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీలో శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై, పోలీసులు బీభత్సం సృష్టిస్తూ అమానుషంగా, లాఠీచార్జ్ చేసిన ఘటనను ఖండిస్తూ నిరసన కారులు ప్లకార్డులు ప్రదర్శించి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మధు శేఖర్, రైతు సంఘం బేతంచెర్ల మండల నాయకులు వీరేలి రామయ్యులు మాట్లాడుతూ, దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడిన నీట్ పేపర్ లీకేజీ, దేశ విద్యా వ్యవస్థపై తీవ్రమైన దాడి అని అన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, విద్యార్థుల కష్టాన్ని, తల్లిదండ్రుల ఆశలను నీరుగార్చిందని విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నీట్ పరీక్షలలో పారదర్శకత పూర్తిగా దెబ్బతిన్నదని, పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని మాత్రమే కాకుండా, దీనికి బాధ్యత వహించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఏ మాత్రం ఉపేక్షించ కూడదని అన్నారు.అలాగే, తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై,పోలీసులు బీభత్సం సృష్టిస్తూ విచక్షణా రహితంగా లాఠీచార్జ్ చేయడం, అత్యంత హేయమైన చర్య అని అన్నారు. విద్యార్థుల గొంతును అణచి వేయడానికి బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ప్రశ్నించే వారిని అణచివేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచలేరని పేర్కొన్నారు.నీట్ పేపర్ లీకేజీపై స్వతంత్ర, పారదర్శక దర్యాప్తు నిర్వహించి, బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వన్నూరు, శేఖర్, రాముడు, రామకృష్ణ, గోపాల్, భీష్మన్న, మద్దయ్య, రామాంజనేయులు, పాపారాయుడు, మహేష్, నాగేశం, నాగభూషణం, పాల్గొన్నారు.

## గడివేముల జిల్లా పరిషత్ పాఠశాలలో మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న సత్యనారాయణ రెడ్డి.



పల్లె వెలుగు దినపత్రిక గడివేముల జిల్లా ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే 4.0 కార్యక్రమం నికి ముఖ్యఅతిథిగా గడివేముల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు దేశం సత్యనారాయణరెడ్డి, తాసిల్దార్ వెంకటరమణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వము విద్యార్థులకు చేపడుతున్న విద్యతోపాటు అన్ని రకాల సదుపాయాలను విద్యార్థులను మంచి నడవడిక మరియు చదువులు తోపాటు క్రీడలు అన్నిటినీ ప్రోత్సహిస్తున్న ఈ ప్రభుత్వము ఎంతో ప్రత్యక్షతాత్మకంగా చేపట్టిన తల్లిదండ్రుల సమావేశానికి నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఒక పండగ వాతావరణం లో నెలకొందని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు..

## దొర్నిపాడు మంచినీటి ట్యాంకు నందు క్వాలిటీ టెస్టులు

దొర్నిపాడు జూలై 24 పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైనదొర్నిపాడు గ్రామం నందు వాటర్ ట్యాంక్ వద్ద మరియు టెంపుల్ వద్ద శుక్రవారం ఆర్డబ్ల్యూఎస్ అధికారులఆదేశాలమేరకు తాగునీటిపరీక్షలునిర్వహించడం జరిగిందని ఏఈ సుప్రజ తెలిపారు, ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ తాగునీటి పరీక్షలలో భాగంగా టర్బిరిటీ



క్లోరినేషన్ పరిమాణాలు ఎంత ఉన్నాయిఅని పరీక్షించడం జరిగిందన్నారు, ట్యాంక్ లో ఉన్న తాగునీటిలోఅన్నిసంతృప్తికరంగఉన్నాయి అన్నారు,దొర్నిపాడు ట్యాంక్ పాత పడడంతో ఇన్లైన్ క్లోరినేషన్ సిస్టం ని ట్యాంక్ వద్ద ఫిక్స్ చేశారు, ఈ ఇన్లైన్ క్లోరినేషన్ సిస్టంలో క్లోరినేషన్ టాబ్లెట్ వేయడం జరుగుతుంది. ఇలా ఈ టాబ్లెట్ ద్వారా నీరు క్లోరినేట్ అయ్యి దానిలో ఉన్న హానికర బ్యాక్టీరియా చనిపోతుంది. ఈరోజు ఇన్లైన్ క్లోరినేషన్ టాబ్లెట్ కూడా ఈ సిస్టంలో వేయడం జరిగింది. అలాగే ప్రతి గ్రామంలో ప్రతి బుధవారము స్కూల్లో మరియు ప్రభుత్వ సంస్థలలో వాటర్ క్వాలిటీ టెస్టులు చేసి పిఆర్ వన్ ఆప్ నందు నమోదు చేయడం జరుగుతుంది అని ఆమె తెలిపారు, సుదర్శన్ రెడ్డి వాటర్ మ్యాన్ సుబ్బయ్య పాల్గొన్నారు

# పెసరవాయి లో ఘనంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం.




పల్లె వెలుగు దినపత్రిక గడివేముల. ప్రభుత్వ ఆదేశాల అనుసారం పెసరవాయి గ్రామం నందు విద్యార్థుల తల్లిదండ్రుల మరియు ఉపాధ్యాయుల సమక్షంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి మేడం అధ్యక్షతన జరిగింది.

ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ గా గడివేముల బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్కూల్ యాజమాన్యం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు క్రమం తప్పకుండా పంపించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయి మరియు మంచి చదువు లభిస్తుంది అలాగే ఉచితంగా రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్టు ద్వారా విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులు అందజేస్తున్నారు అని తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయుల పని తీరుపై ప్రశంసలు కురిపించారు విద్యార్థులలో చదువు పట్ల పురోగతి కనిపించిందని కొనియాడారు.

అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు గ్రామ పెద్దలు అందరూ కలిసి మధ్యాహ్నం సహపంక్తి భోజనంతో ఈ కార్యక్రమాన్ని ముగించారు.

## ప్యాపిలిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ మండల కార్యాలయం ప్రారంభం



పల్లె వెలుగు –?ప్యాపిలి పద్మశ్రీ అవార్డు గ్రహీత, మందకృష్ణ మాదిగ నాయకత్వంలో, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్యాపిలి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్యాపిలి మండల సీనియర్ నాయకులు ఉడక చెట్ల శ్రీరాములు, జెకర్యా, రాముడు, తిమ్మరాజు విచ్చేశారు.

?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా మండలంలోని ప్రజల, దళిత, బహుజన సమస్యల పరిష్కారానికి, హక్కుల పోరాటాలకు ఇదొక వేదికగా నిలుస్తుందని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, మందకృష్ణ మాదిగ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము రాముడు, కొమ్ము రామకృష్ణ, ఆర్. లక్ష్మయ్య, మధు, ఆవుల భార్గవ్, ఆర్. మధు, శేఖర్, బి. కేశవులు, రాజేష్, తిమ్మయ్య, ఆర్. సుంకన్న, కోటి మల్లప్ప, బి. మధు, జక్కాలకుంట్ల రామాంజనేయులు, పెద్ద పూజల జానకి రాముడు, ఓబులేసు, జయరాముడు, శివ, ముద్దు రంగయ్య, గుడిపాడు రాము, ఎమ్. రమేష్, పెద్దపై శీను, జయశంకర్, రఘు, రాము పాల్గొన్నారు.

## అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి వైద్య విద్యార్థిని ఆత్మహత్య



కీసర, జూలై 24 (పల్లె వెలుగు): మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం వెస్ట్ గాంధీనగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసి బెంగళూరులోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న దీక్షిత (26) అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం, గత వారం సెలవుల నిమిత్తం తల్లిదండ్రుల వద్దకు నాగారంలోని నివాసానికి వచ్చిన దీక్షిత శుక్రవారం సాయంత్రం అపార్ట్‌మెంట్ పై అంతస్తు నుంచి దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మైలారం గ్రామం కాగా, కుటుంబం ప్రస్తుతం నాగారంలో స్థిర నివాసం ఉంటోంది. మృతురాలి తండ్రి ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి, ఆత్మహత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.